కథా కౌముది



# యథా..తథా..

పాలపర్తి జ్యోతిష్మతి

పనంతా పూర్తిచేసుకుని పదిగంటలవేళ టీవీ పెట్టుక్కూర్చున్నాను.

"కొంతమంది ఉంటారు, అన్నీ వాళ్ళ కనుకూలంగానే జరగా లనుకుంటారు. కొంచెంకూడా సర్దుబాటు చేసుకోడానికి ఇష్టపడరు. ముందు వాళ్ళ సుఖం చూసుకుంటారు. పక్క మనిషినిగురించి ఆలోచించరు. సాటివారికి సహాయం చెయ్యడం వాళ్ళ బాధ్యతగా తీసుకోరు. అటువంటివాళ్ళమీద సామాన్యంగా మనకి కోపం వస్తుంది, ఒక్కోసారి అసహ్యంకూడా వేస్తుంది. నిజానికి కనీస సంస్కారం లేని వాళ్ళమీద జాలిపడాలి మనం..."

టీవీలో గురువుగారు ప్రవచనం చెప్తున్నారు. వింటూ వింటూ ఆలోచనల్లోకి జారిపోయాను నేను.

రెండురోజులుగా నా మస్తిష్కాన్ని ఆక్రమించి స్థిమితం లేకుండా చేస్తున్న ఆ కుర్రాడిమీద ఇప్పుడు నేను జాలి పడాలన్నమాట.

నిజానికి ఆ కుర్రాడిమీద నాకు కోపంగానీ, అసహ్యంగానీ కలగలేదు. టీనేజ్ పిల్లలు ఇట్లా ఉన్నారేమిటి అన్న ఆలోచన నన్ను ఆందోళనకి గురిచేస్తోంది.

అనుకోని పనిమీద హైదరాబాదు వెళ్ళి మొన్న ఉదయం తిరిగి వచ్చాను. పని పూర్తయి తిరుగు ప్రయాణం ఎప్పటికి కుదురుతుందో తెలీక రిజర్వేషన్ చేసుకోలేదు. బస్టాండుకి వచ్చి ఎదురుగా కనిపించిన, మా ఊరిమీదుగా వెళ్ళే బస్సు ఎక్కి కండక్టరుని 'సీటు ఖాళీ ఉందా?' అని అడిగితే ఒక సీటు నాకు ప్రసాదించాడు.

కాసేపటికి ఒక కుర్రాడు, ఏ బీటెక్కో చదువుతూ ఉండి ఉంటాడు, వచ్చి నా పక్కన కిటికీ సీట్లో కూర్చున్నాడు.

నేను కూర్చున్న సీటుకి అవతలపక్క సీట్లో కిటికీపక్కన ఒకాయన, ఇవతల ఒకావిడ కూర్చున్నారు. ఆవిడకూడా నాలాగే రిజర్వేషను లేకుండా ఎక్కికండక్టరు దయకతమున ఆ సీట్లో కూర్చోగలిగింది. ఆవిడ భర్త ఇంకెక్కడో, కిటికీ సీటు ఎవరో రిజర్వ్ చేసుకుంటే వాళ్ళ పక్కన ఖాళీ సీట్లో కూర్చున్నాడు.

'ఈ రిజర్వేషన్లు చేసుకునేవాళ్ళు ఎవరికివాళ్ళు తలాఒక విండోసీటు రిజర్వ్ చేసుకుని పక్క సీట్లన్నీ ఖాళీగా వదలకపోతే పొందిగ్గా వరుసక్రమంలో చేసుకోవచ్చుకదా' అని మనసులోనే సమస్త ప్రయాణీక లోకంమీద విసుక్కుని "బాబూ! నీకభ్యతరం లేకపోతే అటు కూర్చుంటావా? ఆడవాళ్ళం ఒకచోట కూర్చుంటాం" అన్నాను నా పక్కన కూర్చున్న కుర్రాడితో అటుపక్క సీటు చూపిస్తూ.

"విండో సీటు కావాలండీ! గాలి కావాలి" అని నాకు సమాధానం చెప్పి, బ్యాగ్‌లోకి చేతులు దూర్చి ఏదో వెదుకులాడుకోవడం మొదలుపెట్టాడు.

కేవలం సహాయం చేసే తత్వం లేకపోవడమే కాదు, ఉచితసలహా లిచ్చే అలవాటుకూడా ఉన్నట్టుంది ఆ కుర్రాడికి. 'ఆయన్నే ఇక్కడ కూర్చోమనండి' అంటూ ఒకటి నా మొహాన కొట్టి చెవుల్లో వైర్లు దూర్చుకుని సెల్‌ఫోన్‌లో సినిమా చూస్తూ వేరే లోకంలోకి వెళ్ళిపోయాడు.

ఈ కుర్రాడొచ్చి నా పక్కన కూర్చోకముందే ఆ పక్కసీట్లోఆవిడ, ఆమె భర్త కూర్చున్నచోటికి వెళ్ళమని అతన్ని అడగడమూ,

కాదనిపించుకోవడమూ అయిపోయాయి. అతను చెప్పినమాటకూడా అదే 'విండోసీటు కావాలి, గాలి కావాలి' అని.

నిజానికి 'ఒక మగాడి పక్కన కూర్చుని రాత్రంతా ప్రయాణం చెయ్యాలా?' అని భయపడాల్సిన వయసుకాదు నాదికానీ, ఆ కుర్రాడిది కానీ సాపేక్షంగా చూస్తే.

సమవయస్కుడైన పరపురుషుడి పక్కన కూర్చోవలసివచ్చిన, ఆ పక్కసీట్లోని నడివయసు స్త్రీ ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని నేను ఆ కుర్రాడితో సీటు మారే ప్రతిపాదన చేశాను. కాదనిపించుకున్నాక ఆ విషయం అక్కడితో వదిలేసి నా ధ్యాసలో నేను పడ్డాను. కానీ తల్లిలాంటి ఒక స్త్రీ కోరిన చిన్న ఫేవర్‌ని ఆ కుర్రాడు అంగీకరించలేక పోవడాన్ని నేను అంగీకరించలేక పోతున్నాను.

నా ఆలోచనల్లో నేనుండగా "అత్తయ్యా...!" అంటూ సుడిగాలిలా వచ్చి నా పక్కన కూర్చున్నాడు నా ముద్దుల మేనల్లుడు. పక్క వీధిలోనే ఉంటున్న నా తమ్ముడి కొడుకు వాడు. చెన్నైలో ఎంబియ్యే చదువుతున్నాడు. వాళ్ళమ్మ ఉద్యోగానికి వెళితే చిన్నప్పుడు నా దగ్గరే పెరిగాడు వాడు. ఆ మాటకొస్తే నా తమ్ముడుకూడా నా చేతుల్లోనే పెరిగాడు.

టీవీని మ్యూట్‌లో పెట్టి "ఎప్పుడొచ్చావురా?" అన్నాను ఆనందం ఆశ్చర్యం కలగలిసిన స్వరంతో.

"పొద్దున్నే వచ్చాను. అమ్మ నీ కిది ఇచ్చి రమ్మంది" అంటూ ఒక కవరు నా చేతిలో పెట్టి లేచి నిల్చున్నాడు.

"కూర్చోరా, అప్పుడే లేచావేంటి?" అంటూ వాడి చెయ్యి పట్టి లాగాను ఆ కవర్లో ఏముందో చూడనుకూడా చూడకుండా ఓ పక్కన పెడుతూ.

నేను లాగిన ఊపుకి నా పక్కన కూలబడుతూ "రాత్రి ప్రయాణానికి ఒళ్ళు హూనమైపోయిం దత్తయ్యా! పడుకోవాలి" అన్నాడు.

"అదేంటిరా, సీటు రిజర్వు చేసుకోలేదా? నిలుచుని వచ్చావా?" అన్నాను ఆదుర్దాగా.

"సుబ్బరంగా కిటికీపక్కసీటే రిజర్వ్ చేసుకున్నాను. కానీ నా సీట్లో నేను కూర్చోలేదు" అన్నాడు వాడు.

"ఎందుకని?" కుతూహలంగా అడిగాను ఏదో అర్థమవుతున్న ట్టనిపించినా.

"చిన్న అడ్జెస్ట్‌మెంట్. ఒక వృద్ధజంట రిజర్వేషన్ లేకుండా ఎక్కారు. నా పక్క సీటు ఖాళీగా ఉంది. ఇంకో ఖాళీసీటు వెనకెక్కడో దొరికింది వాళ్ళకి.వాళ్ళు రిక్వెస్ట్ చేశారు. నేను వెనక సీటుకి మారిపోయాను. ఎత్తెత్తి వేసిందనుకో. కిటికీ సీటుకూడా కాదు. అస్సలు గాలాడలేదు, నిద్ర పట్టలేదు" అన్నాడు వాడు బద్ధకంగా ఆవులిస్తూ.

"సౌకర్యవంతమైన సీటు రిజర్వు చేసుకునికూడా ఇబ్బంది పడ్డావన్నమాట" అన్నాన్నేను నిట్టూరుస్తూ.

"పోన్లే అత్తయ్యా! నేను సీటివ్వక పోయుంటే పాపం ఆ పెద్దాయనో, ఆవిడో ఆ వెనకసీట్లో కూర్చోవలసి వచ్చేది. నాకే ఇంత బడలికగా అనిపిస్తుంటే ఆ వయసులో వాళ్ళు ఆ ప్రయాసకి తట్టుకోగలరా?" అంటూ మళ్ళీ లేచాడు వాడు.

"సరే! వెళ్ళి పడుకో" అన్నాన్నేను వాణ్ణి సాగనంపడానికి లేస్తూ.

"అయినా ఇప్పుడు నేను చెయ్యాల్సిన రాచకార్యాలుమాత్రం ఏమున్నాయిలే, పడుకుని నిద్రపోవడం తప్ప. మళ్ళీ సాయంత్రం వస్తాలే" అంటూ వెళ్ళిపోయాడు.

వాడితోబాటు గుమ్మందాకా వెళ్ళిన నేను 'వీళ్ళ నాన్నకూడా ఇంతే చిన్నప్పణ్ణించీ. ఎవరికి ఏ అవసరం వచ్చినా సహాయం చెయ్యడానికి సిద్ధంగా ఉంటాడు' అని మురిపెంగా అనుకుంటూ వెనక్కి తిరిగితే మ్యూట్‌లో పెట్టిన టీవీలో పెదవులు కదులుస్తూ కూర్చున్న గురువుగారు నన్ను మళ్ళీ జాలి పడడం దగ్గరికి లాక్కెళ్ళారు.

కిటికీ పక్క సీట్లో కూర్చుని తప్ప ప్రయాణం చెయ్యలేని ఆ కుర్రాడిమీద కాదు, కొడుక్కి కనీస సంస్కారం నేర్పలేకపోయిన తల్లిదండ్రులమీద జాలి కలిగింది నాకు.

పనిలో పనిగా ఆపక్కసీట్లో అతనిమీదకూడా జాలి పడ్డాను, 'రేపెప్పుడైనా విండో సీటు దొరకకపోతే ఈ మనిషి ప్రయాణ మెట్లా చేస్తాడా?' అని కాదు, 'భవిష్యత్తులో అతని సంతానంకూడా ఈ కుర్రాడిలాగే తయారవుతారు గదా' అనిపించి.

COMMENTS